బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 25 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 8వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 14వ తేదీలోగా చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

పరిశీలకులను నియమించిన ఎన్నికల కమిషన్

మేడ్చల్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు వ్యయ, జనరల్, పోలీస్ పరిశీలకులను ఎన్నికల కమిషన్ నియమించింది. వ్యయ పరిశీలకులుగా మనోజ్ ఆలోఈస్ లక్రా(ఐఆర్ఎస్), ధృవ భోళా(ఐఎఅండ్ఏఎస్), జనరల్ పరిశీలకులుగా డాక్టర్ ఎంఎస్ ప్రియాంక శుక్లా(ఐఎఎస్), పోలీస్ పరిశీలకులుగా రామేశ్వర్ సింగ్(ఐపీఎస్)లను నియమించినట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే 7337047775, 73704778, 733704776, 7337209990 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

ఆర్గానిక్ జర్నల్‌లో పరిశోధన అంశం

సిటీబ్యూరో, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ) :ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన సీనియర్ సైంటిస్ట్ దేబేంద్ర మహాపాత్ర చేసిన పరిశోధన గ్రంథాన్ని ప్రముఖ కెమికల్ జర్నల్.. ద జర్నల్ ఆఫ్ ఆర్గానిక్ కెమిస్ట్రీ ప్రచురించింది. టోటల్ సింథసిస్ అండ్ డిటర్మినేషన్ ఆఫ్ అబ్‌సాల్యూట్ కన్ఫిగరేషన్ ఆఫ్ క్రిప్టో రిజిడీఫాలియోల్ జీ అంశంపై ఆయన చేసిన పరిశోధన ఫలితాన్ని ప్రచురించారు. కాగా ప్రముఖ ఆర్గానిక్ జర్నల్‌లో పరిశోధన అంశం ప్రచురితం కావడంపై ఐఐసీటీ వర్గాలు మహాపాత్రకు అభినందనలు తెలిపాయి.

ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా గురువారం పోలింగ్ సిబ్బంది అధికారుల రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ తెలిపారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి నేతృత్వంలో జనరల్, పోలీస్ అబ్జర్వర్ల సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనలు అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా పోలింగ్ సిబ్బంది, అధికారుల రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లాలోని సికింద్రాబాద్, హైదరాబాద్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాలకు మేడ్చల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలకు కేటాయించాల్సిన సిబ్బంది, అధికారుల రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ గురించి జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ అబ్జర్వర్లకు వివరిస్తూ, ప్రక్రియ మొత్తాన్ని ఎన్నికల ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో సీపీ శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, జిల్లా కలెక్టర్, హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి, హేమంత్ కేశవ్ పాటిల్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జనరల్ అబ్జర్వర్ శ్రీవిద్య, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జనరల్ అబ్జర్వర్ డాక్టర్ సరోజ్ కుమార్, హైదరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల పోలీస్ అబ్జర్వర్ శశంక్ ఆనంద్, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు భేష్

నగర పర్యటనలో పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల జనరల్, పోలీస్ ఎన్నికల పరిశీలకులు జిల్లా పర్యటనకు వచ్చారు. సికింద్రాబాద్-8 పార్లమెంట్ నియోజకవర్గానికి డాక్టర్ సరోజ్‌కుమార్ (2008 ఐఏఎస్ బ్యాచ్), హైదరాబాద్-9 పార్లమెంట్ నియోజకవర్గానికి (2010 ఐఏఎస్ బ్యాచ్)కు చెందిన పి.శ్రీవిద్య, హైదరాబాద్, సికింద్రాబాద్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాలకు 2006 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శశాంక్ ఆనంద్ బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. నగర పర్యటనలో భాగంగా గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను తెలుసుకున్నారు. అంతేకాకుండా ఒక్కొక్క నియోజకవర్గంలో ప్రశాంతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు చేపడుతున్న ఏర్పాట్లను ఎన్నికల అధికారి, కమిషనర్ రొనాల్డ్ రాస్ వివరించారు. అనంతరం వీరి సమక్షంలో ఎన్నికల విధులు నిర్వహించనున్న పీఓ, ఏపీఓలు ఇతర పోలింగ్ సిబ్బంది సంబంధించిన ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి పోలీస్, జనరల్ ఎన్నికల పరిశీలకులు జిల్లా ప్రొఫైల్‌తో పాటు పోలింగ్ స్టేషన్, కౌంటింగ్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్, పోలింగ్ పర్సనల్ ట్రైనింగ్ పోస్టల్ బ్యాలెట్ హోం ఓటింగ్, వీవీటీ తనిఖీ బృందాలు, ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియపై జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్ఎంసీ కమిషనర్ వివరించారు. పోలీసులు చేపట్టిన చర్యలపై పోలీస్ అడిషనల్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కంప్లైంట్ గ్రీవెన్స్ కాల్ సెంటర్, ఎంసీసీ కంట్రోల్ రూంను జనరల్ పరిశీలకులు పరిశీలించారు. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై జనరల్, పోలీస్ పరిశీలకులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ కొరడా.. సీఎం ఫ్లెక్సీలు తొలగింపు

ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కతూ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలను తొలగిస్తున్న ఎన్నికల సిబ్బంది

కంటోన్మెంట్, ఏప్రిల్ 25 : కంటోన్మెంట్‌లో ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో నిబంధనలు అతిక్రమించిన వారిపై కొరడా ఝుళిపిస్తున్నారు. గురువారం సాయంత్రం కంటోన్మెంట్‌లోని బాలంరాయి, అన్నానగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో కోసం పెద్ద సంఖ్యలో స్థానిక కాంగ్రెస్ నేతలు భారీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలకు సంబంధించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు రావడంతో వాటిని బోర్డు సిబ్బంది తొలగించారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక ప్రచారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం పరిధిలోని అన్నా నగర్‌లో రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ క్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు సీఎం దృష్టిలో పడేందుకు భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు అందడంతో వారు రంగంలోకి దిగి ఫ్లెక్సీలను తొలగించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు ఫ్లెక్సీలను తొలగించవద్దని కోరారు. సీఎం సభ వరకు ఉంచాలని అభ్యర్థించినా, అధికారులు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తొలగిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయరాదని పేర్కొన్నారు.

ప్రపంచంలోనే అతి పెద్ద సినిమా లైబ్రరీ



ఇంటర్నేషనల్ టార్చ్ క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న హనురోజ్, దామోదర్ ప్రసాద్, ప్రసన్నకుమార్ తదితరులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 25 : భారతదేశంతో పాటు ప్రపంచ సినిమాలన్నింటినీ ఒకే వేదికపై తీసుకువచ్చేందుకు ప్రపంచంలోనే అతి పెద్ద సినిమా లైబ్రరీ జైపూర్‌లో నిర్మితం కానున్నదని జైపూర్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు హనురోజ్ తెలిపారు. గురువారం సాయంత్రం ఖైరతాబాద్‌లోని ప్రసాద్ ఐమాక్స్ థియేటర్‌లో భారతదేశంలోని చిత్రాలతో పాటు తెలుగు చిత్రపరిశ్రమాభివృద్ధి, పాన్ ఇండియా సినిమాలకు తగిన ప్రోత్సాహం అందించాలన్న లక్ష్యంతో ఇంటర్నేషనల్ టార్చ్ క్యాంపెయిన్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంపేయిన్‌ను ఫిలించాంబర్ కార్యదర్శి, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి టి.ప్రసన్నకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీ ఆధారంగా సినిమాల నిర్మాణం జరిగేలా తమ ట్రస్ట్ ద్వారా తమ వంతు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. 2009 నుంచి అనేక ఫిలిం ఫెస్టివల్స్, సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను నిర్వహించామని, కేంద్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందన్నారు. పాన్ ఇండియా సినిమాలకు తెలుగు రాష్ట్రాలు మంచి వేదికగా ఉన్నాయని, ఇలాంటి చిత్రాల నిర్మాణం కోసం నిర్మాతలకు సహకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత నాగులపల్లి పద్మిని, ఉమామహేశ్వర్ రావు, ఎంఎస్ ప్రసాద్, వై.అనిల్, రామ్‌కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నాటక, నాటిక పోటీలు ప్రారంభం

నాటక, నాటిక పోటీలు ప్రారంభిస్తున్న పరుచూరి బ్రదర్స్, డీఎస్ఎన్ మూర్తి తదితరులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 25 : పరుచూరి రఘుబాబు స్మారక 34వ జాతీయ నాటక, నాటిక పోటీలు గురువారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో ప్రారంభమయ్యాయి. పరుచూరి గోపాలకృష్ణ సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ రచయిత నటులు, దర్శకుడు పరుచూరి వెంకటేశ్వర రావు, ప్రముఖ రంగస్థల నటులు గుమ్మడి గోపాలకృష్ణ, నాటక, సినీ టీవీ నటి శివపార్వతి, రంగస్థల దర్శకులు ఆచార్య డీఎస్ఎన్ మూర్తి హాజరై రఘుబాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు ముందు రచన దర్శకత్వం వహించిన పొలుదాసు శ్రీనివాస్ రూపొందించిన రాత నాటిక, మంజునాథ దర్శకత్వం వహించిన జేబు చెప్పిన ఊసలు నాటకం, రైతే రాజు, బూడిద నాటికలు పలువురు కళాకారులు నటించి వీక్షకులను అబ్బుర పరిచారు. ప్రముఖ సంఖ్యా శాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి 'సుమేధన' సమ్మర్ క్యాంప్

బంజారాహిల్స్, ఏప్రిల్ 25 :హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సుమేధన పేరుతో సాంస్కృతిక శిక్షణ శిబిరాన్ని మే 2నుంచి నిర్వహించనున్నామని హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యచంద్ర గౌరదాస తెలిపారు. గురువారం బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమేధన సమ్మర్ క్యాంప్ పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం సత్యచంద్ర గౌరదాస మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన పెంచేలా కార్యక్రమాలు రూపొందించామన్నారు. పెయింటింగ్, వక్తృత్వం, స్కెచింగ్, కథలు చెప్పడం తదితర అంశాలతో పాటు భగవద్గీత శ్లోక పఠనం, మంత్రం, ధ్యానం తదితర అంశాల్లో 21రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 6 నుంచి 16 ఏళ్ల వయస్సు గల విద్యార్థులు ఈ శిబిరాల్లో పాల్గొనవచ్చని ఆరు కేంద్రాల్లో క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మరింత సమాచారం కోసం 8143655188 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సుమేధన సమ్మర్ క్యాంపు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యచంద్ర గౌరదాస

వీఎన్ఆర్‌వీజేఐటీలో అంతర్జాతీయ సదస్సు



సావనీర్‌ను విడుదల చేస్తున్న ప్రముఖులు

దుండిగల్, ఏప్రిల్ 25 :వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో హ్యూమానిటీస్, సైన్సెస్ విభాగం, సీఎస్ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఆప్లైడ్ మేథమెటిక్స్ అండ్ అడ్వాన్స్ డేటా ఎనలిటిక్స్ ఫర్ ఇండస్ట్రీ 5.0' పేరిట అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. సదస్సుకు దేశవ్యాప్తంగా 270 పరిశోధకులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సదస్సులో విదేశాంగశాఖా మాత్య సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ గిరీశ్ కుమార్, ఇస్రో సీనియర్ శాస్త్రవేత్త డా.రీతు కరిధల్, మహీంద్రా విశ్వవిద్యాలయ సలహాదారులు ఏఐ విభాగాధిపతి ఆచార్య డా.అరుణ్‌కుమార్ పుజారి, ఎన్ఆర్ఎన్‌సీ ఉప సంచాలకులు డా.కె.శ్రీనివాస్, సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సీఈఓ డా.శ్రీరామ్ బిరుదవోలు, ఎన్ఐటీ వరంగ్ ఆచార్యులు, ఏపీటీఎస్ఎంఎస్ అధ్యక్షుడు డా.డి.శ్రీనివాసాచార్య, మీ సీసీపీ విశ్వవిద్యాలయంలో పరిశోధక అచార్యులు డా.రవిసధాశివుడు హాజరయ్యారు. విద్యార్థులు తగిన గణిత సూత్రాలను క్షుణ్ణంగా నేర్చుకొని డేటా సైన్స్ రంగంలో సమస్యలకు తగిన పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఎన్ఆర్‌వీజేఐటీలో నృత్యతరంగ్ శాస్త్రీయనృత్య విద్యార్థి కూటమి సభ్యుల స్వాగతోత్సవంతో చూపరులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాధ్యాపకులు ఆచార్య డా.సి.డి నాయుడు, సంచాలకులు ఆచార్యడా.బి చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

27న మెగా జాబ్ ఫెయిర్

అబిడ్స్, ఏప్రిల్ 25 : నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పించాలనే సంకల్పంతో ఈ నెల 27న సిటీ మెగా జాబ్ ఫెయిర్ - 2024 నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డెక్కన్ బ్లాస్టర్స్ చైర్మన్ మన్నన్‌ఖాన్ ఇంజినీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాసాబ్‌ట్యాంక్‌లోని ఖాజా మాన్షన్ కన్వెన్షన్ హాల్‌లో ఈ మెగా జాబ్ ఫెయిర్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పదవ తరగతి నుంచి డిగ్రీ పాసైన వారు ఉద్యోగాలు పొందేలా వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి ఆఫర్ లెటర్‌లను అందించడం జరుగుతుందని తెలిపారు. డెక్కన్ బ్లాస్టర్స్ ద్వారా అనేక జాబ్ మేళాలను నిర్వహించి వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందేలా కృషి చేశామన్నారు. ఇతర వివరాలకు 8374315052 సంప్రదించాలని కోరారు.

బేగంపేట్‌లో రోడ్డుపై కారు దగ్ధం

బేగంపేట్, ఏప్రిల్ 25 : రోడ్డుపై ప్రయాణిస్తున్న కారులో మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన గురువారం రాత్రి 7:15 గంటలకు బేగంపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ముషీరాబాద్‌కు చెందిన రాజేందర్ తన భార్యతో కలిసి వ్యక్తిగత పనులపై బేగంపేట్‌కు వచ్చాడు. బేగంపేట్‌లోని కట్టమైసమ్మ దేవాలయం సమీపంలో కారులో ప్రయాణిస్తుండగా కారులోనుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు వ్యాపించారు. దీంతో వెంటనే రాజేందర్ దంపతులు కారు దిగారు. అప్పటికే మంటలు చెలరేగి కారు మంటల్లో కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను పూర్తిగా ఆర్పివేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూలో ఓపెన్ డే

టెక్నాలజీ కళాశాలలో ఓపెన్ డే బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 25 : ఉస్మానియా యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు 'ఉస్మానియా తక్ష్ - 2024'లో భాగంగా వర్సిటీలోని అన్ని కళాశాలలు, విభాగాలలో ఓపెన్ డే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విభాగాలలో ప్రత్యేకంగా కొన్ని అంశాలలో పోటీలు నిర్వహించారు. మరికొన్ని విభాగాలలో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఆయా విభాగాలన్నింటినీ తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్టను మరింత పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ వేడుకలకు విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. వర్సిటీ గత వైభవాన్ని ప్రస్తుత తరం విద్యార్థులకు చాటిచెప్పేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వర్సిటీ ప్రారంభించిన రోజును పురస్కరించుకుని వ్యవస్థాపక దినోత్సవాన్ని గత 104 ఏళ్లలో ఎప్పుడూ నిర్వహించలేదని గుర్తు చేశారు. రెండేళ్ల క్రితం నుంచి ప్రతీ ఏడాది వర్సిటీని ప్రారంభించిన ఏప్రిల్ 26వ తేదీన ఘనంగా ఓయూ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నేను తప్పకుండా ఓటు వేస్తా

ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్నికల అధికారులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ జిల్లాలో ఓటింగ్ శాతం పెరిగేలా అన్ని వర్గాల ప్రజలను వివిధ కార్యక్రమాల ద్వారా చైతన్య పరుస్తున్నారు. అందులో భాగంగా జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ దిశానిర్దేశంతో జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచే దిశగా అన్ని విధాల గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఓటరు అవేర్నెస్ ఫోరమ్స్ ఏర్పాటు చేస్తూ, అన్ని వర్గాల ప్రజలను మమేకం చేస్తూ ఓటు ప్రాధాన్యత, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. నేను తప్పకుండా ఓటు వేస్తాను అని ప్రతిజ్ఞ చేయించడంతో పాటు, మీ ఓటు మరోసారి ఓటరు జాబితాలో చెక్ చేసుకోవాలని, ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు ఉందన్న విషయం ఏ విధంగా తెలుసుకోవాలి అన్న విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ప్రోత్సహిస్తున్నారు. ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. ఈడీ, సీబీఐ దాడులా?

దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్

జవహర్‌నగర్, ఏప్రిల్ 25 : బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. ఈడీ, సీబీఐతో దాడులు చేస్తూ, కార్పొరేట్ మిత్రులతో ప్రధాని మోదీ దోస్తీ చేస్తూ దేశ సంపదకు స్వస్తి పలుకుతున్న నియంతృత్వ బీజేపీని సమాధి చేద్దామని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సమావేశం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్ గిరిప్రసాద్ నగర్‌కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ హాజరై మాట్లాడారు. పదేండ్ల బీజేపీ పాలనలో దేశం నిరుద్యోగం, పేదరికంతో ప్రమాదకరమైన సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నదని, నిత్యావసరాల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నా.. పట్టించుకోకుండా మత విద్వేశాలను రెచ్చగొడుతున్న బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్పీఎస్ జిల్లా కార్యదర్శి సహదేవ్, సహాయ కార్యదర్శి మహేశ్ కుమార్, అశోక్‌కుమార్, నర్సింహారావు, కృపాకర్, దయాకర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రవికిరణ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) :గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఆదేశాల మేరకు గురువారం ప్రపంచ మలేరియా డే కార్యక్రమాన్ని బేగంపేట సర్కిల్ వెస్ట్ మారేడ్‌పల్లి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (హెల్త్ అండ్ శానిటేషన్) రవి కిరణ్, జీహెచ్ఎంసీ చీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంటమాలజీ సిబ్బంది దోమల నిర్మూలన కార్యక్రమంలో ఉత్సాహంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. చీఫ్ ఎంటమాలజిస్ట్ డా.రాంబాబు మాట్లాడుతూ వ్యక్తిగతంగా తీసుకోవలసిన చర్యలు, సమాజ పరంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో బేగంపేట డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, సికింద్రాబాద్ జోన్ సీనియర్ ఎంటమాలజిస్ట్ దుర్గాప్రసాద్, బేగంపేట సర్కిల్ అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ శ్రీనివాస్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ ధనా గౌడ్, డివిజన్ సూపర్ వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.